క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ


మహమ్మద్ అలీని అభినందిస్తున్న కలెక్టర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎస్ జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మహమ్మద్ అలి గత నెల 28వ తేదీన జార్ఖాండ్ రాష్ట్రంలోని జెంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. విద్యార్థిని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అభినందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, పీఈటీలు వెంకటేష్, సృజనకుమారి, బసవరాజు మంగళవారం తెలిపారు. అలాగే మహమ్మద్ వలిని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మహబుబ్‌బాషా, ఉపాధ్యాయులు, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజులు అభినందించారు.

కానిస్టేబుల్‌కు పరామర్శ


కానిస్టేబుల్ షేక్‌సాబ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆదోని అర్బన్: మండల పరిధిలోని పెసలబండ గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జన సమయంలో జరిగిన దాడిలో గాయపడిన ఇస్వీ కానిస్టేబుల్ షేక్‌సాబ్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రజలకు రక్షణగా ఉన్నటువంటి వారిపైనే దాడులు జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడి జరిగిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఉన్నారు.

తహసీల్దార్, ఎస్ఐలపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : సొంత చట్టాలను అమలు పరుస్తున్న తహసీల్దారు గీతాప్రియదర్శిని, ఎస్ఐ నిరంజన్‌రెడ్డిలపై తక్షణమే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప కోరారు. సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలులో జాయింట్ కలెక్టర్ నవ్యను కలసి వినతిపత్రం సమర్పించారు. భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ ఉన్నారు.

మహిళకు కుక్కకాటు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో మంగళవారం కుక్క కాటుకు పార్వతి అనే మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఉదయం గ్రామంలో పూలు విక్రయించేందుకు వీధుల్లో తిరుగుతుండగా కుక్కల గుంపు నుంచి ఓ కుక్క అమాంతం పార్వతి మీదకు రావటంతో కూలబడింది, దీంతో కుక్క ఎడమ కాలిను నోటితో పట్టి లాగటంతో చర్మం ఎముక వరకు ఊడిపడింది. కేకలు వేయటంతో అక్కడ ఉన్నవారు వెళ్లి కుక్కలను తరివివేయడంతో ప్రాణాలతో బయటపడింది. గాయపడ్డ మహిళను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీఐని సస్పెండ్ చేయాలి

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు పట్టణంలో వినాయక నిమజ్జనంలో సీఐ శ్రీనివాసులు దౌర్జన్యం , అత్యంత అసహనంగా ప్రవర్తించారని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, వినాయక ఉత్సవ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు బసవన్నగౌడ్ పట్టణ గౌరవాధ్యక్షుడు ఎగ్గటి ప్రతాప్, సభ్యులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

స్వచ్ఛతే శ్రేయస్కరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: స్వచ్ఛతే మానవాళికి శ్రేయస్కరమని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి, ఎమ్మెల్యే మంజుల లింబావళి అధ్వర్యంలో మంత్రాలయంలో శ్రీమఠం స్వచ్ఛ సుందర కార్యక్రమం చేపట్టారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో కార్యక్రమం ప్రారంభించారు. శ్రీమఠం మధ్వద్వారంలో స్వచ్ఛ సేవకులతో ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. సేవకులు తుంగాతీరం, ఆర్టీసీ బస్టాండ్, పట్టణంలో పలు ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు గావించారు.

మాట మార్చడం వల్లే సమస్య

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో జరుగుతున్న పద్ధతిని హమాలీలు ఆదోని మార్కెట్‌యార్డులో కూడా అమలు చేస్తామని సెక్రటరీ కల్పన ముందు ఒప్పుకుని మరలా మాట మార్చడం వల్లే సమస్య వచ్చిందని వేరుశనగకాయల వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు శరణబసప్ప అన్నారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు.


రచ్చుమర్రిలో నివాళులర్పిస్తున్న దృశ్యం


మంత్రాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కౌతాళంలో జోహార్లు అర్పిస్తున్న ప్రహ్లాదాచారి, నాయకులు


బదినేహాల్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం


కోసిగిలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మదిమదిలో మహారాజు

- పేదల మదిలో చెరగని స్థానం సంపాదించుకున్న మహానేత వైఎస్సార్
- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


ఆదోని పట్టణంలో ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ శ్రేణులు

ఆదోనిటౌన్: పేదల మదిలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహానేత వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి నిర్మల్ టాకీస్ రోడ్డు, భీమాస్ సర్కిల్ మీదుగా గోస్ ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ కాంస్య విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి జలాభిషేకం చేశారు. గజమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత అందించిన సేవలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఎంతో సాహసోపేతమైన నిర్ణయాలతో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర ప్రజలకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తాయన్న, నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగేశ్వర యాదవ్, నారాయణ, కామాక్షి తిమ్మప్ప, సన్నీ, ప్రతాప్‌రెడ్డి, వై.పి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మండలంలోని విరుపాపురం గ్రామంలో మంగళవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, మాజీ జెడ్పీటీసీ ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కపటి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖగౌడ్, గోపాల్‌గౌడ్, నారాయణ, దేవదాస్, సుధాకర్, భాస్కర్, దక్షిణమూర్తి స్వామి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు వైకుంఠవాసులు, నాగేంద్రయ్యస్వామి, రంగన్న, తిమ్మప్ప, కేసన్న, నాగేష్, ఆటో ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జనహృదయ నేతకు ఘన నివాళి

మంత్రాలయం రూరల్ : జన హృదయ నేత దివంగత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఊరు వాడలా జననేతకు ఘన నివాళులర్పించారు. మంగళవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, సతీమణి జయమ్మ హైదరాబాద్‌లోని తన స్వగృహంలో దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మంత్రాలయం మండల కేంద్రంలోని రాఘవేంద్ర స్వామి సర్కిల్‌లో వైఎస్సార్ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జీ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు రోగప్ప, బొజ్జప్ప, మాలపల్లి గ్రామ సర్పంచ్ సీతారామిరెడ్డి నేతృత్వంలో మహానేత వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, వైస్ సర్పంచ్ పరమేశ్, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, గోరుకల్లు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం : మండల కేంద్రంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బదినేహాల్ గ్రామంలో ఉపసర్పంచ్ ప్రసన్న గౌడ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినాకర్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, మాజీ సర్పంచ్ అవతారం, ఉపసర్పంచ్ తిక్కయ్య, ఎంపీటీసీ మూకన్న, వడ్డేరాము, డాక్టర్ సుబ్బరాజు, రాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: మండలకేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, మండల నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, కృష్ణమూర్తి, గానిగ వీరస్వామి, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఇంటి నుంచి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప, పబ్లిసిటీ వింగ్ విభాగం డివిజన్ అధ్యక్షుడు ముక్కరన్న, వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, నాయకులు బ్రహ్మయ్య, అర్లప్ప, అయప్ప తదితరులు పాల్గొన్నారు.


కపటి గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


విరుపాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పెద్దకడబూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


బసలదొడ్డిలో నివాళులర్పిస్తున్న దృశ్యం


గుల్బర్గలోని విద్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అభివృద్ధి ప్రదాత ..


ఎమ్మిగనూరులో వైఎస్సార్ విగ్రహనికి పూలమాల వేస్తున్న యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు


ఎమ్మిగనూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి పనులు మంజూరు చేసిన అభివృద్ధి ప్రదాత దివంగత మహానేత వైఎస్సార్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత నేత వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నాడు అడిగిన వెంటనే పులికనుమ, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లాంటి స్కీంలు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, వైస్ ఎంపీపీ పోలయ్య, నాయకులు కోటేకల్ లక్ష్మన్న, పెద్దయ్య, రంగస్వామి, గుడికల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం : మండలంలోని హాలహర్వి గ్రామంలో మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునెమ్మ, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, మాజీ సర్పంచ్ రామకోటేశ్వర రెడ్డి, రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు దావీదు, కోతి ఈరన్న, మహిళ విభాగపు అధ్యక్షురాలు సావిత్రమ్మ, తిమ్మప్ప, ప్రకాష్‌రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బిజినెస్ వింగ్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి కాశిరెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, తాలూకా అధ్యక్షుడు మురళీ నాయుడు, నాయకులు అల్లాబకాష్, మోహన్ రెడ్డి, తోలు రాముడు, గోవింద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సంక్షేమ పథకాలతో బడుగుల అభ్యున్నతి

ఎమ్మిగనూరుటౌన్: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ అన్నారు. దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సోమప్ప సర్కిల్‌లో దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమం, భవిత కేంద్రం, వేదాస్ సంస్థ అనాథ ఆశ్రమం, గురుదత్త ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు బోయ బజారి, ఉపాధ్యక్షుడు కోటకొంట నరసింహులు, పాల శ్రీనివాసరెడ్డి, విశ్వ నాథ్‌రమేష్, కె.విశ్వనాథ్, మహబూబ్ బేగ్,చంద్ర, లతారెడ్డి, పామయ్య బసిరెడ్డి, ప్రభాకర్, గడ్డం అంజి పాల్గొన్నారు.

వెంకటాపురం కాలనీలో

పట్టణంలోని వెంకటాపురం కాలనీలో కౌన్సిలర్ బోయ బజారి.యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు బోయ రాజుల ఆధ్వర్యంలో కాలనీ వాసులు దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్ణాటక కేంద్రీయ విద్యాలయంలో మహానేతకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో మంగళవారం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు సునీల్‌కుమార్, పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


నందవరం మండలం హాలహర్విలో మహానేత విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


హెచ్‌బీఎస్ కాలనీలోని అనాథ ఆశ్రమంలో పిల్లలకు అన్నం వడ్డిస్తున్న బుట్టా ప్రతుల్, మున్సిపల్ చైర్మన్


ఇబ్రహీంపురంలో వైఎస్సార్ చిత్రాపటానికి పూలమాల వేసి నివాళుల్పరిస్తున్న దృశ్యం


గోనెగండ్లలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెగని పాసింగ్ పంచాయితీ


వేరుశనగకాయల దిగుబడులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని అర్బన్: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వేరుశనగ వ్యాపారులతో చర్చలు జరిపి పైలట్ ప్రాజెక్టు కింద 15 రోజుల పాటు మంగళవారం నుంచి గ్రేడింగ్ లేకుండా టెండర్ వేసి దిగుబడులు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో యార్డు అధికారులు మంగళవారం యథావిధిగా వేరుశనగకాయల మార్కెట్ ప్రారంభమవుతుందని ప్రకటించారు. రైతులు దిగుబడులను ఆదోని యార్డుకు తరలించారు. అయితే మంగళవారం వ్యాపారులు సబ్‌కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోకుండా టెండర్‌ను నిలిపివేశారు. దీంతో యార్డు అధికారులు వెంటనే సబ్‌కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన మార్కెట్‌యార్డుకు వచ్చారు. రాశులు పోసిన వేరుశనగ దిగుబడులను పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వ్యాపారస్తులను పిలిపించాలని యార్డు అధికారులను ఆదేశించారు. ఫోన్ చేసిన అరగంట తర్వాత వచ్చిన వేరుశనగ వ్యాపారులకు సబ్‌కలెక్టర్, యార్డు సెక్రటరీ రాశులు పోసిన దిగుబడులను చూపించారు. అనంతరం యార్డు కార్యాలయంలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో చర్చలు జరిపారు. వ్యాపారులు మాత్రం గ్రేడింగ్ లేకుండా టెండర్ వేయమని, ఎమ్మిగనూరు యార్డు పద్ధతి ప్రకారమైతే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. చర్చలు విఫలం కావడంతో సబ్‌కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

న్యాయం చేయండి సారూ...

పది రోజుల క్రితం ఆదోని మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తెచ్చిన దిగుబడులు బూజుపడుతున్నాయని, వాసన వస్తున్నాయని, తమకు న్యాయం చేయాలని వేరుశనగ దిగుబడుల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయం వద్దకు రైతులు వచ్చి అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు.

ఏ యార్డులోనైనా అమ్ముకోండి..

పది రోజుల నుంచి తెచ్చిన దిగుబడులను ఏమి చేయాలి, తాము వేరే మార్కెట్‌లో అమ్ముకోవడానికి తమ దిగుబడులను బయటకు పంపాలని రైతులు కోరారు. వెంటనే యార్డు సెక్రటరీ కల్పన దిగుబడులను బయటకు పంపుతాం, మీరు ఏ యార్డులోనైనా అమ్ముకోవచ్చని అనుమతిచ్చారు.

వ్యాపారులకు షోకాజ్ నోటీసులు

టెండర్ వేయకుండా రైతులను ఇబ్బంది పెట్టినందుకు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ ఆదేశాల మేరకు వేరుశనగకాయల వ్యాపారులకు షోకాజ్ నోటీసులు పంపినట్లు యార్డు సెక్రటరి కల్పన తెలిపారు. వ్యాపారులు ఒప్పుకునేంతవరకు వేరుశనగకాయల మార్కెట్‌ను బంద్ చేస్తున్నామన్నారు. రెండు రోజుల తర్వాత వ్యాపారుల వివరణ తీసుకుని, వారి లైసెన్సులు క్యాన్సిల్ చేయాలా లేదానన్న దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తాము ప్రకటించేంతవరకు రైతులు వేరుశనగ దిగుబడులను యార్డుకు తీసుకురావొద్దని చెప్పారు.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట


బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

నందవరం : అధికారం కోసం సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హాలహర్వి, ధర్మపురం గ్రామాల్లో మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి రికాల్ టీడీపీ మ్యానిఫెస్టో అనే నిరసన కార్యక్రమం చేపట్టారు. క్యూఆర్‌కోడ్ కలిగిన కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వ పరిపాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించారు.

ఎల్లెల్సీలో విగ్రహాల తొలగింపు



ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల తొలగింపు ప్రక్రియను మంగళవారం మున్సిపల్ అధికారుల శ్రీకారం చుట్టారు. దాదాపు 200లకు పైగా విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు. నీట మునిగిన విగ్రహాలను భారీ టాటా హిటాచితో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ నీరజలు పరిశీలించారు.

ఇంటి వద్దకే రేషన్ ఇవ్వకపోతే చర్యలు

పెద్దకడబూరు : 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలని, లేనిపక్షంలో డీలర్లపై చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే గ్రౌండ్ వాలిడేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. అలాగే గ్రామంలోని సచివాలయాలను, చౌక ధరల దుకాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 60 సంవత్సరాలు దాటిన వారికి రేషన్ ఇంటికి వేయలేదని ఆరోపణలు రావడంతో తహసీల్దారుతో పాటు రేషన్ దుకాణదారులపై మండిపడ్డారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలో లోపించిన పారిశుద్ధ్యంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లన్నీ ఇలా చెత్త చెత్తగా ఉంటే ప్రజలు రోగాలబారిన పడరా అని కోపగించుకున్నారు. తహసీల్దారు గీతాప్రియదర్శిని, ఆర్ఐ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

గోనెగండ్ల: పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఈనెల చివరి లోపు పూర్తి అయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని హౌసింగ్ పీడీ టి. చిరంజీవి సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని స్టీల్, సిమెంట్ గోడౌన్‌ను హౌసింగ్ పీడీ తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

కోసిగి: జిల్లాలోనే వెనుకబడిన కోసిగి, కౌతాళం మండలాలకు డీఎస్సీ పోస్టులలో ప్రాధాన్యత కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాలను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షులు వీరేష్ కోరారు. మంగళవారం కర్నూలు జిల్లా డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు అభి, రవి, సిమోన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా దారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీ, ఎస్ఎంటీ కాలనీల్లో మున్సిపల్ స్థలాలను కబ్జా చేసిన వారిపై అధికారులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు కెసి జబ్బార్, దాదావలి, విజయేంద్ర, ఖాజ పాల్గొన్నారు.

దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయండి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే శ్రీచింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల అధికారులతో దశమి ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

రుణాలిచ్చి సహకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ రుణాలు ఇచ్చి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి క్రీడాదుస్తులను మంగళవారం పంపిణీ చేశారు.